క్లుప్తంగా

వైభవంగా విశ్వేశ్వరుని కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేట రెండోలైనులోని శ్రీగౌరీ విశ్వేశ్వరాలయంలో మంగళవారం స్వామి జన్మనక్షత్రం సందర్భంగా దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. జంధ్యాల పవన్‌కుమార్ శర్మ, వెంకటలక్ష్మి, మిట్టపల్లి అయ్యప్ప చక్రవర్తి, లక్ష్మీ ప్రశాంతి దంపతులతో అర్చకులు విశ్వేశ్వర శర్మ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సుబ్రహ్మణ్య శాస్త్రి, మల్లికార్జున శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీసీలకు అత్యధిక స్థానాలు కేటాయించాలి

నెహ్రూనగర్: ఏ రాజకీయ పార్టీ అయినా బీసీలకు ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో మూడు స్థానాలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారే తప్ప వారికి చేసిందేమి లేదని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికలలో బీసీలకు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మూడు స్థానాలు కేటాయించాలని, లేకుంటే బీసీలను ఏకగ్రీవంగా నిలబెట్టి గెలిపించుకుంటామని వివరించారు.

ఉద్యోగోన్నతుల్లో న్యాయం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గతేడాది జరిగిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో భాగంగా ఉద్యోగోన్నతికి విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా నెలకు రూ.2,500 అలవెన్సు ఇస్తామని చెప్పి, ఐదు నెలలు పని చేసిన తరువాత ఉద్యోగోన్నతులను రద్దు చేయడం అన్యాయమని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధ నిర్ణయాలను సవరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీ నిబంధనల్లో అసంబద్ధ నిర్ణయాలను సవరించాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో సంఘ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు అధ్యక్షతన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై నిర్వహించిన ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్యఅతిథిగా జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రమోషన్లు, బదిలీల విషయంలో విద్యాశాఖ వైఖరి, జారీ చేస్తున్న ఉత్తర్వులు ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేస్తున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, నాయకులు డీఏ జోసెఫ్, పేరేచర్ల శ్రీనివాసరావు జి.జోజప్ప, వై.శ్యాంబాబు, కేవీ రమణ, ఎం.శ్రీనివాసరావు, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు బయో డైవర్సిటీ కన్జర్వేటర్ అవార్డు

పాత గుంటూరు: డాక్టర్ పట్టాభి కళాపీఠం, నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ బయో డైవర్సిటీ బోర్డు(జీవన వైవిధ్య మండలి) ఏటా అందించే బయో డైవర్సిటీ కన్సర్వేటర్ అవార్డును అందుకున్నారు. సోమవారం తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బోర్డు చైర్మన్ డాక్టర్ బి.ఎం.కె. రెడ్డి, డాక్టర్ కె. గోపీనాథ్, వెటర్నరీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.రవి నుంచి రాజేంద్రప్రసాద్ అవార్డును అందుకున్నారు. రాజేంద్రప్రసాద్ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నందుకు ఈ అవార్డు దక్కింది. ఆయనకు అవార్డు దక్కడంపై పలువురు రచయితలు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.

ఘనంగా హరిద్ర శృంగార్చన

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలోని శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ జి.నరసింహమూర్తి మాట్లాడుతూ ఆలయంలో వివాహం కాని ఆడపిల్లలకు శీఘ్రంగా వివాహం జరుగుటకు ప్రత్యేకంగా పసుపు కొమ్ములతో హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, పరిసర గ్రామాల నుంచి భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

వలంటీర్ సేవలతోనే 'సంక్షేమం'లో తెనాలి అగ్రగామి

'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్యే శివకుమార్



జె.సరోజినీదేవిని సేవా వజ్ర అవార్డుతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గడప గడపకు మన ప్రభుత్వం వంటి కార్యక్రమాల్లో తెనాలి నియోజకవర్గం జిల్లాలోనే అగ్రగామిగా ఉండటానికి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తుండటమే కారణమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వార్డు వలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాల ప్రదానం మంగళవారం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో ఘనంగా నిర్వహించారు. 13–25 వార్డుల పరిధిలో జరిగిన 'వలంటీర్లకు వందనం'లో జె.సరోజినిదేవిని రూ.30 వేల పారితోషికంతో కూడిన 'సేవా వజ్ర' అవార్డును అందజేశారు. మరో ఆరుగురిని రూ.20 వేల ప్రోత్సాహకం లభించే 'సేవా రత్న', రూ.10 వేల పారితోషికం అందించే సేవా మిత్ర అవార్డుతో 267 మందిని సత్కరించారు. సంక్షేమ సారథులైన వలంటీర్లతో సహా అంతా సమష్టిగా కృషిచేసినందునే ఇంతటి విజయాన్ని సాధించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కరోనా కష్టకాలంలోనూ సమర్థవంతంగా సేవలందించిన వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ పనితీరును ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గుర్తించి, దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టే ఆలోచన చేస్తుండటం గొప్ప విషయమన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జన్మభూమి కమిటీల పనితీరుతో నాలుగేళ్లలోనే ఆ ప్రభుత్వానికి చెడ్డపేరొచ్చిందని, ఫలితంగా ఎన్నికల్లో తగిన మూల్యాన్ని చెల్లించాల్సి వచ్చిందన్నారు. తొంభై శాతం వలంటీర్లు చక్కగా పని చేస్తున్నారని చెబుతూ మిగిలిన 10 శాతం రాగద్వేషాలతో పనిచేయకపోతే ఆ ప్రభావం ప్రభుత్వంపైనా, స్థానిక ప్రజాప్రతినిధిగా తనపైనా ఉంటుందని చెప్పారు. రాబోయే రోజుల్లో వలంటీర్లు మరింత అంకితభావంతో విధులను నిర్వహించాలని కోరారు. వలంటీర్లను నాయకులుగా చేస్తానని సీఎం చెప్పిన మాటలను ప్రస్తావిస్తూ, భవిష్యత్‌లో వలంటీర్లదే కీలకపాత్రని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు మాట్లాడారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కృష్ణబలిజ, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, వార్డు కౌన్సిలర్లు షేక్ దుబాయ్ బాబు, తాడిబోయిన రామయ్య, యాతాటి అనిల్, పార్టీ నేతలు కఠారి హరీష్, శానంపూడి రఘురామిరెడ్డి, చుండూరు సాయి, కొల్లా గురునాథ్‌గుప్త, కాళిదాసు సత్యం, నాలాది ప్రభాకర్, అక్కిదాసు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భజన సంకీర్తనాపరులు వెంకటేశ్వర్లుకు సన్మానం



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న సాంబశివుడు, శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం పాండవ వనవాసము చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం జస్టిస్ చౌదరి చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం సాంఘిక నాటక కళాకారుడు, భజన సంకీర్తనాపరులు, రచయిత చందు వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కె.సాంబశివుడు, సుంకర శ్రీనివాసరావు, బి.మోహనరావు, జాలాది రాంబాబు, దాసరి నరసయ్య, వరికూటి సోమయ్య, పెమ్మసాని పోతురాజు, సోమవరపు సాంబశివరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవానీ, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, వెలగా సుభాష్ చంద్రబోస్, గుమ్మడి ప్రసాద్, ముళ్ళపూడి వెంకట్, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మాస్టర్ మైండ్స్' నగదు పురస్కారాలు



మట్టుపల్లి మోహన్

తెనాలి: పట్టణంలోని వివిధ విద్యా సంస్థల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను మాస్టర్ మైండ్స్ యాజమాన్యం ఘనంగా సత్కరించి, ప్రతిభా పురస్కారాలను అందజేయనున్నట్టు ఆ సంస్థల అడ్మిన్ అడ్వయిజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. స్టేట్ సిలబస్ అయితే 550, ఆ పైన మార్కులు పొందినవారు, ఐసీఎస్ఈ సిలబస్‌లో 550, ఆపైన మార్కులు, సీబీఎస్ఈ సిలబస్‌లో 450, ఆపైన మార్కులు సాధించిన విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు అర్హులుగా తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగే సభకు సదరు విద్యార్థులు ఆధార్‌కార్డు/ స్కూల్ ఐడీ కార్డు, పదో తరగతి మార్కుల జాబితా (ఇంటర్నెట్ కాపీ)తో సహా హాజరుకావాలని కోరారు. వివరాలకు 9248722218/ 7780390139 నంబర్లను సంప్రదించి రిజిస్టరు చేసుకోవాల్సిందిగా సూచించారు. విద్యార్థులకు సర్టిఫికెట్, జ్ఞాపికతో నగదు బహుమతిని ప్రదానం చేస్తామని వివరించారు.

విగ్రహ దిమ్మె కూల్చివేతపై ఆందోళన



ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడుతున్న సీఐ

గుంటూరు రూరల్: విగ్రహ దిమ్మె కూల్చివేతపై దళిత సంఘాల ఆందోళన చేసిన ఘటన నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలో జరిగింది. గతంలో గ్రామంలోని మేరిప్రియనగర్ సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేసి దిమ్మెను ఏర్పాటు చేశారు. దిమ్మె, విగ్రహ ఏర్పాట్లకు నగర కార్పొరేషన్ అనుమతి లేదనే ఉద్దేశంతో అధికారులు దిమ్మెను ధ్వంసం చేశారని స్థానిక ప్రజలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. విషయం తెలిసిన నల్లపాడు సీఐ శ్రీనివాసరావు ఘటన స్థలికి చేరుకుని ఆందోళన విరమించాలని సర్దిచెప్పారు. ఆందోళన విరమించకపోవటంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత భర్త మాజీ ఇన్‌కంటాక్స్ కమిషనర్ మేకతోటి దయాసాగర్ కలగజేసుకుని మరలా అన్ని అనుమతులతో విగ్రహం ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇవ్వటంతో ప్రజా సంఘాల నాయకులు నిరసనను విరమించుకున్నారు. అనంతరం రోడ్డుపైన నిలిచిన ట్రాఫిక్‌ను పోలీసులు క్రమబద్ధీకరించారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు, నిత్యావసర సరుకులు అందిస్తున్న తహసీల్దార్ ప్రసాదరావు

బోడిపాలెం(కాకుమాను): బోడిపాలెం ఎస్సీ కాలనీలో ఆదివారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సర్వం కోల్పోయిన కుటుంబానికి మంగళవారం తహసీల్దార్ జె.ప్రసాదరావు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని, నిత్యావసర సరుకులను అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన నలిగల సునందరావుకు చెందిన ఒంటి నిట్టాడి పూరిల్లు ఆదివారం దగ్ధమైందని, సునందరావు కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారని విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో సుమారు రూ.1.80 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు వివరించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5వేలతోపాటు, నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్లు వెల్లడించారు. బాధిత కుటంబానికి ప్రభుత్వం తరుపున పక్కా గృహం నిర్మించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నలిగల యెషయ్య, వీఆర్వోలు దానియేలు, శింగారావు పాల్గొన్నారు.

'యాప్'లోన్ తీర్చలేక మరో యువకుడు మృతి..

- గడ్డి మందు తాగడంతో.. రేపల్లె వైద్యశాలలో చికిత్స
- వారం రోజులు మృత్యువుతో పోరాటం..



రేపల్లె రూరల్: గడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన ఘటన మైనేనివారిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ సురేష్ వివరాల మేరకు నగరం మండలం గొడపాలేనికి చెందిన చెన్ను సాయి(22) కొంతకాలంగా రేపల్లె మండలంలోని మైనేనివారిపాలెంలో తన తండ్రి నాగమల్లేశ్వరరావు వద్ద ఉంటున్నాడు. డిగ్రి పూర్తయిన తర్వాత ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ ఆన్‌లైన్ యాప్ ఎం పాకెట్ ద్వారా రెండేళ్ల క్రితం రూ.40వేలు లోన్ తీసుకున్నాడు. కొంత కాలంగా ఎం పాకెట్ నిర్వాహకులు తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని అడుగగా.. డబ్బులు కట్టలేక మనస్తాపం చెంది.. ఈ నెల 16న గడ్డిమందు తాగాడని తెలిపారు. సాయిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని వివరించారు. తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిపై విచారణ

- హెల్త్ సూపర్‌వైజర్ వ్యవహార తీరుపై ఆరా
- విచారణాధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకున్న వైద్యాధికారి భార్య, కుమార్తె



పీహెచ్‌సీలో విచారణ చేస్తున్న హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులు

కొల్లూరు: కొల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి, హెల్త్ సూపర్‌వైజర్‌పై ఫిర్యాదు అందడటంతో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ టీవీఎస్ఎన్ శాస్త్రి, ఫ్యామిలీ ప్లానింగ్ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీలు విచారణలో పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డి.రవిబాబు, హెల్త్ సూపర్‌వైజర్ వి.మేరీపై అనంతవరం సచివాలయ ఏఎన్ఎం పీఎన్‌బీ కుమారి పలు ఆరోపణలు చేస్తూ.. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో వైద్యశాల సిబ్బంది, ఆశ కార్యకర్తలను, అనంతవరం సచివాలయ సిబ్బందిని అధికారులు విచారించారు.పీహెచ్‌సీ వైద్యాధికారి రవిబాబు ప్రధానంగా వైద్యశాల పరిధిలోని ఓ మహిళా సిబ్బందితో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని, విధుల్లో మద్యం సేవించి రోగులకు అందుబాటులో ఉండటం లేదని, వైద్యశాలలోని ఓ గదిని బెడ్ రూమ్‌గా మార్చుకుని అక్కడే మద్యం సేవిస్తూ పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని, ఆపరేషన్ థియేటర్‌ను వంటశాలగా మార్చుకోవడం వంటి ఆరోపణలు విచారణాధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం. హెల్త్ సూపర్ వైజర్ మేరీ అనంతవరంలో పనిచేసే ఓ ఆశ కార్యకర్తకు, ఏఎన్ఎంకు మధ్య కులాల చిచ్చు పెట్టి వివాదం కొట్లాట వరకు వెళ్లేలా చేసిందనే ఆరోపణపై.. విచారణాధికారులు సచివాలయ సిబ్బంది, గ్రామస్తుల నుంచి సమాచారం సేకరించారు.

వైద్యాధికారితో సన్నిహితంగా ఉన్న మహిళా సిబ్బంది వైద్యశాల పరిధిలోని పలువురు సిబ్బందిని మానసికంగా వేధింపులకు గురిచేస్తోందని, ఆమెకు వత్తాసుగా వైద్యాధికారి సిబ్బందితో జరిపే సమావేశాలలో బయట వ్యక్తులను పిలిపించి, ఒకరిని లేకుండా చేయాలనే.. బెదిరింపులకు దిగడం వంటి ఆరోపణలపై సిబ్బందిని అధికారులు విచారించారు.అలాగే వైద్యాధికారి రవిబాబు భార్య, కుమార్తె విచారణాధికారుల ఎదుట హాజరయ్యారు. తమ భర్త వైద్యశాలలో పనిచేసే ఓ మహిళా సిబ్బందితో అక్రమ సంబంధం ఏర్పరుచుకుని, తమ పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు కొన్ని ఆధారాలతో గోడు వెళ్లబోసుకోవడంతో వివరాలు నమోదు చేసుకున్నారు.

నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం

విచారణ అధికారులు టీవీఎస్ఎన్ శాస్త్రి, నిర్మల గ్లోరీలు ఈ విషయమై స్పందిస్తూ.. తమకు ఏఎన్ఎం పీఎన్‌బీ కుమారి చేసిన ఫిర్యాదు ఆధారంగా సిబ్బంది, వైద్యాధికారి భార్య, కుమార్తె వద్ద సమాచారం సేకరించామన్నారు. విచారణలో వెల్లడైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి, నివేదికను సిద్ధం చేస్తామన్నారు. ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. పీహెచ్‌సీ పనితీరు మెరుగు పరిచేందుకు అధికారులకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు.

వృద్ధుడి మృతి



గుంటూరు రూరల్: అనారోగ్యంతో నల్లపాడు శివారు పొలాల్లో వృద్ధుడు మృతి చెందిన ఘటన మంగళవారం జరిగింది. సీఐ శ్రీనివాసరావు కథనం ప్రకారం ఏటీ అగ్రహారం, శాంతినగర్ రెండవలైనుకు చెందిన కోట చిన్ననాగిరెడ్డి (57) నల్లపాడు బైపాస్ సమీపంలో పొలాల వద్ద మృతి చెంది ఉన్నాడు సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహం వద్ద థమ్సప్ బాటిల్, వాటర్ బాటిల్ ఉన్నాయి. మద్యం తాగేందుకు అక్కడికి వచ్చి ఎండతీవ్రతకు మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుని కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చేబ్రోలు: గుర్తుతెలియని కారు బైక్‌ను ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో మంగళవారం జరిగింది. పాతరెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ సుబాని నారాకోడూరులోని పెట్రోలు బంక్‌లో నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వస్తున్నాడు. వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. ఘటనలో సుబాని కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫేస్‌బుక్ పోస్టుపై కేసు

గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తి ఒక పాస్టర్ మరో పాస్టర్‌ను నిందిస్తున్నట్లు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టాడు. ఈఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి ఫేస్‌బుక్‌లో అంకమ్మనగర్‌లో నివశించే రమేష్ అనే పాస్టర్ మరో పాస్టర్ అద్దంకి రంజిత్ ఓపియర్‌ను నిందిస్తున్నట్లు పోస్ట్ చేశాడు. దీంతో పాస్టర్ల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విద్యానగర్‌లోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి భార్య సోమవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ని భర్త మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: వృద్ధురాలు కనిపించకుండా పోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏటి అగ్రహారానికి చెందిన 65 సంవత్సరాల కుప్పాల సామ్రాజ్యం ఈనెల 18న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో కుమారుడు రాంబాబు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు పొన్నూరులో టిడ్కో ఇళ్ల పంపిణీ



ప్రారంభోత్సవానికి సిద్ధమైన టిడ్కో గృహాలు

పొన్నూరు(చేబ్రోలు): పట్టణం పరిధిలోని నిడుబ్రోలులో నిర్మించిన 1,660 గృహాలను తొలి విడతగా బుధవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాధారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 2368 టిట్కో గృహాలకు గాను, ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో 1660 గృహాలు పూర్తి అయినట్లు చెప్పారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి హాజరవుతారని చెప్పారు. మిగిలిన లబ్ధిదారులకు రెండో విడతలో టిట్కో గృహాలు అందజేయనున్నట్లు చెప్పారు.

వైభవంగా ఆంజనేయస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం హనుమత్ సువర్చలా కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వంశ పారంపర్య అర్చకులు ఆర్ శ్రీనివాసమూర్తి నేతృత్వంలో వైదిక క్రతువును అర్చకులు కిరణ్, సురేష్ జరిపారు. తెలుగు పండితులు ములుకుట్ల విశ్వనాథశర్మ ప్రవచనం చేయగా, సంకీర్తన బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, ఈఓ అవుతు శ్రీనివాసరెడ్డి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సేవా సమితి అధ్యక్షులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, జంధ్యా రామారావు తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు శరత్‌బాబు మృతికి మా–ఏపీ సంతాపం



శరత్‌బాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దిలీప్‌రాజా, సభ్యులు

తెనాలి: సినీ నటుడు శరత్‌బాబు మృతి బాధాకరమని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన శరత్‌బాబుకు మంగళవారం సాయంత్రం తెనాలిలోని మా–ఏపీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. శరత్‌బాబు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బాలచందర్ స్కూలు నుంచి వచ్చిన నటుల్లో శరత్‌బాబు ఒకరని గుర్తుచేసుకున్నారు. చెన్నైలో దర్శకుడు జంధ్యాల ఆయన నివాసంలోనే తనకు శరత్‌బాబును పరిచయం చేసినట్టు చెప్పారు. తాను తీసిన 'మన్నెంలో మొనగాడు' టెలీ ఫిలింలో అలనాటి జానపద హీరో కాంతారావు కాంబినేషనుల్లో శరత్‌బాబు కూడా నటించినట్టు తెలిపారు. విలక్షణ నటన, ఉన్నతమైన వ్యక్తిత్వం గల శరత్‌బాబు మృతికి విచారం వ్యక్తం చేశారు. మా–ఏపీ సభ్యులు పాల్గొన్నారు.

హాస్య నటచక్రవర్తి 'కాళిదాసు'కు ఘననివాళి



కాళిదాసు కోటేశ్వరరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కళారంగ ప్రముఖులు

తెనాలి: ప్రముఖ రంగస్థల నటుడు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాళిదాసు కోటేశ్వరరావు వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బోసురోడ్డులోని కాళిదాసు కోటేశ్వరరావు కాంస్య విగ్రహానికి కుటుంబ సభ్యులు, రంగస్థల కళాకారులు పుష్పాంజలి ఘటించారు. కాళిదాసు సత్యనారాయణ, విజయశ్రీ దంపతుల ఆధ్వర్యంలో అక్కడే పేదలకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. హాస్య నటచక్రవర్తి కోటేశ్వరరావు నటనా ప్రతిభను, ఆయన ధరించిన పాత్రలు, అందులోని వైశిష్ట్యాన్ని స్మరించుకున్నారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, సినీదర్శకుడు దిలీప్‌రాజా, కళాకారుల సంఘం కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, కోశాధికారి బుర్రా జయలక్ష్మి, బి.దుర్గారావు, ఎ.దాసు, దీపాల సుబ్రమ్మణ్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నగరంపాలెం పీఎస్ ఎస్ఐ సస్పెన్షన్

నగరంపాలెం: నగరంపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రవితేజను సస్పెండ్ చేశారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలానికి చెందిన ఓ యువతి ఉన్నత విద్య కోసం శిక్షణ పొందుతూ గుంటూరులోని ఓ ప్రైవేట్ వసతిగృహంలో ఉంటుంది. ఆమె ఎస్ఐ మోసగించారంటూ ఈనెల 20న నగరంపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ క్రమంలో ఎస్ఐ రవితేజను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఉత్తర్వులు జారీచేశారు.

ఎన్జీ రంగా వర్సిటీ వీసీకి సన్మానం



వీసీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ పరిశోధన స్థానాలు, కళాశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది, కాంట్రాక్ట్ వర్కర్స్, సెక్యూరిటీ స్వీపర్స్, డ్రైవర్స్, అటెండర్స్ తదితరులకు వేతనాలు పెరిగిన సందర్భంగా మంగళవారం వేడుకలు నిర్వహించారు. నగర శివారుల్లోని లాంఫాంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాన్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీసీ డాక్టర్ ఎ. విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ వృద్ధికి అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్ఎల్ కుమార్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు కె అమ్మిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జె విజయసారథి, ట్రెజరర్ ఎమ్ నరశింహ, జనరల్ సెక్రటరీ ఆర్ విజయ్‌కుమార్, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.